కథ

# చేజారిపోనీకు..!

గుమ్మడి రవీంద్రనాథ్
82973 56766

స్పర్శ

హార్ట్ ఇన్‌స్టిట్యూట్. దేశంలోని అత్యాధునిక ఆసుపత్రులలో ఒకటి. ఆ ఇన్‌స్టిట్యూట్ భవంతి నాలుగో అంతస్తులో ఉంది రీసెర్చ్ ల్యాబ్. కృత్రిమ గుండెకు రూపకల్పన జరుగుతున్నదా ల్యాబ్‌లో. ఒక ప్రత్యేక నిపుణుల బృందం ఆ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్నది. డా.దీపిక కూడా ఆ బృందంలో ఉన్నది. ఆమె హృద్రోగ నిపుణురాలు. కార్డియోథొరాసిక్ శస్త్ర చికిత్సల్లో 'రోబోటిక్' నైపుణ్యం కూడా ఉన్నది. అక్కడ తయారవుతున్న 'హృదయంత్రం' అని పిలిచే ఆ 'ఎల్‌వీఏడీ' పరికరం వైపు నిశితంగా చూస్తున్నది డా.దీపిక. సరిగ్గా అప్పుడే ఆమె ఫోన్ వైబ్రేట్ అయింది.

''ఒక ఎమర్జెన్సీ సర్జరీ దీపికా! ఓటీకి రాగలవా?''.. అదే హాస్పిటల్‌లో పనిచేస్తున్న డా.స్వాతి చెప్పింది ఫోన్‌లో.

* * *

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఒక యువకుణ్ని 108 వాహనం ఆ ఆసుపత్రికి తీసుకొచ్చింది.

''టిప్పర్ గుద్దేసింది. బతికే ఉన్నాడు. పల్స్ ఉంది'' అంబులెన్స్ సిబ్బంది ఒకతను చెప్పాడు.. ముప్పై ఐదేళ్ల ఆ యువకుణ్ని స్ట్రెచర్ మీదికి మారుస్తూ, ఎమర్జెన్సీ రూమ్‌లో ఉన్న డా.స్వాతితో.

'సీటీ'లో తెలిసింది.. అతనికి మల్టిపుల్ రిబ్ ఫ్రాక్చర్స్‌తోపాటు ఛాతీ ఎముక కూడా విరిగిపోయింది! 'న్యూమో పెరికార్డియమ్'! వెంటనే ఆపరేషన్ చేయకపోతే బతకడు. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న అతని తల్లిదండ్రులు వచ్చారు.

''వాడు నా ఒక్కగానొక్క బిడ్డమ్మా! పేరు శరత్. కలలో కూడా ఎవ్వరికీ హాని తలపెట్టని సున్నిత హృదయం వాడిది. సొంత తెలివితేటలతో చిన్న వయసులోనే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీకి అధిపతి కాగలిగాడు. వాడినెలాగైనా బతికించమ్మా!''.. అతని తల్లి కన్నీళ్లతో డా.స్వాతికి చేతులు జోడించింది. వెంటనే దీపికకి ఫోన్ చేసింది స్వాతి.

* * *

ఆపరేషన్ థియేటర్‌లో డా.దీపికతోపాటు మరొక సర్జన్ కూడా ఉన్నారు. శరత్ అనే ఆ రోగి ముఖంలోకి చూసింది దీపిక. అతని తలకూ, ముఖానికీ ఏ గాయాలూ లేవు. అందరూ 'సర్జరీ మోడ్'కి వచ్చేశారు. 'యాంటెరోలేటరల్ తొరాక్టమీ'కి సిద్ధమయ్యారు. కుడివైపు పెరికార్డియం చిట్లిపోవడం గుర్తించింది దీపిక. పెరికార్డియల్ సేక్ నిండా రక్తం! ఆ రక్తాన్ని 'తోడితే' కనిపించింది.. కుడి వెంట్రికిల్ ముందుభాగంలో సెంటీమీటర్ మేర ఉన్న మయోకార్డియల్ ల్యాసిరేషన్! దాన్ని 'మరమ్మతు' చేయాలిప్పుడు. పెరికార్డియల్ ప్యాచ్‌తో 2/0 ప్రోపిలీన్ కుట్లువేశాక మరమ్మతు పూర్తయింది. అక్కడే ఉన్న స్వాతి చిరునవ్వుతో దీపికని చూసి..

''యూ సేవ్డ్ అనదర్ లైఫ్ దీపికా!'' అన్నది అభినందనగా!

మర్నాడు మౌర్య అనే పోలీస్ అధికారి హాస్పిటల్‌కి వచ్చాడు. డా.దీపికకు మౌర్య తెలుసు.

''నిన్నటి యాక్సిడెంట్ కేస్ గురించి వచ్చాను డాక్టర్!'' చెప్పాడు మౌర్య.

''తాగి నడుపుతున్నాడా.. ఆ ట్రక్ డ్రైవర్?'' అడిగింది డా.దీపిక.

''ట్రక్ డ్రైవర్ తప్పేమీ లేదు మేడం. ఈ శరత్ అనే వాడే కావాలని ట్రక్‌కి ఎదురెళ్లాడు!''.

''వ్వాట్?''.

''సీసీటీవీలో స్పష్టంగా రికార్డ్ అయింది!'' అంటూ మొబైల్‌లో ఆ ఫుటేజ్‌ని ఆమెకు చూపించాడు.

ట్రక్ వేగంగా వస్తున్నది. రోడ్డు పక్కనే నిలబడి ఉన్నాడు శరత్. ఉన్నట్టుండి హఠాత్తుగా రోడ్డు మధ్యకు నడచి.. ఆ ట్రక్‌కి ఎదురెళ్లి పోతున్నాడు! డ్రైవర్ అరుస్తూ బ్రేక్‌వేసి స్టీరింగ్ పక్కకు తిప్పినా.. ట్రక్ శరత్‌ని గుద్దేసింది!

''హీ ట్రైడ్ టు కిల్ హిమ్ సెల్ఫ్ డాక్టర్!''.. నిర్ఘాంత పోయి చూస్తున్న దీపికతో చెప్పాడు మౌర్య.

సాయంత్రం రౌండ్స్‌కి వెళ్లినప్పుడు ఐసీయూలో ఉన్న శరత్ బెడ్ దగ్గరికి వెళ్లింది డా.దీపిక.

''ఎలా ఉన్నారు?'' అని అడిగింది.

అతను బదులేమీ ఇవ్వలేదు. ఆమెవైపు కన్నెత్తి చూడనుకూడా చూట్టం లేదు.

''బలవంతంగా మిమ్మల్ని మీరు చంపుకోవాలనుకునేంత కష్టం ఏమొచ్చింది శరత్?''..

ఆ ప్రశ్నకి తలెత్తాడు.

''మీ రక్తంలో 'యాంటీయాన్డ్రోజెన్' ఆనవాళ్లు ఉండటం నేను చూశాను!'' అని దీపిక అనగానే.. అప్పుడు శరత్ నోరు విప్పాడు.

''ఆ భగవంతుడు నా మెదడులో రెండు పరస్పర వైరుధ్య భావాలను ఉంచి నన్నొక శాపగ్రస్తుణ్ని చేశాడు డాక్టర్! మాట ద్వారా, చూపు ద్వారా కూడా ఇతరులకు ఏ చిన్న 'బాధ' కలిగించినా.. అదీ హింసే అని నమ్మే

